విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

చెరువులని తలపిస్తున్న రోడ్డు

- ధాన్యం తరలించాలంటే తిప్పలు

విశాలాంధ్ర- కొడవలూరు: ఆరు కాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అన్నదాతలు అమ్ముకోవా లంటే చెరువులని తలపిస్తున్న రోడ్లతో ఎన్నో కష్టా లు పడుతున్నారు. మండ ల పరిధిలోని బొడ్డువారిపాలెం నుంచి తలమంచికి వెళ్లే రోడ్డు అయిదు కిలోమీటర్లు వరకు ఉంటుంది. ఈ పరిధిలో ఎక్కువభాగం రైతులు వరిధాన్యాన్ని సాగుచేస్తుంటారు. అందులో కొంతభాగం మల్లెపూల సాగుకుడా ఉంటుంది. వరిలో ఎక్కువ భాగం బిపిటిటీలు, నెల్లూరు జిలకర రకాలు రైతులు సాగు చేస్తుంటారు. దుక్కినుంచి వరి కోతలు సింహా భాగం యంత్రాలపైనే ఆధారపడటం ఆనవాయితీగా వస్తోంది. రైతులు పండించిన ధాన్యం మార్కెట్టుకు తరలించి అమ్ముకోవాలంటేనే అన్నదాతలకు కష్టాలు మొదలు అవుతాయి. ఈ రోడ్డు మీదకు లారీలు, ట్రాక్టర్లు రావాలంటే వాటి యజమానులు భయభ్రాంతులకు గురివుతున్నారు. అన్నదాతలు ఎన్నో కష్టాలు పడి పండించుకున్న కల్లాలలోనే నిలిచి పోయే పరిస్థితి నెల కొంది. దానికి తోడు చిన్నపాటి వర్షం వచ్చిన రోడ్డు మీద నిలిచి పోయి అవి పోయేదారి లేక రోడ్ల మీదనే నిలిచి పోయి చెరువులని తలపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అధీనంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకంలో అయినా నిధులు మంజూరు చేసి రోడ్లకు మరమ్మతులు చేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

లోన్ యాప్‌ల పేరుతో దగా

- నిందితుల అరెస్ట్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: లోన్ యాప్‌ల ద్వారా అమాయ కులను మోసం చేస్తున్న ఆదిలాబాద్ కి చెందిన యువరాజు అనే యువ కుడి పై నెల్లూరు లోని బాలాజీ నగర్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేశారు. యువరాజు తో పాటు అజయ్ పవన్ కళ్యాణ్ , రాథోడ్ సాయి కిరణ్, కర్ణాటకకు చెందిన అబ్దుల్ లు మసూద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన అబ్దుల్ మసూద్ అలహాబాద్ ఐఐటీ లో మూడవ సంవత్సరం చదువుతున్నాడు. నెల్లూరు నగరం లోని ఆదిత్య నగర్ కి చెందిన విద్యాసాగర్ రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలాజీ నగర్ పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేశారు. బాధితుడు 30 వేలు లోను తీసు కోకుంటే అతని ఫొటోలు మార్ఫింగ్ చేస్తామని బెదిరించి అతని వద్ద నుంచి 40 లక్షలు దాకా వసూలు చేశారని ఆరోపిం చారన్నారు. నిందితుల పేరు మీద ఉన్న బ్యాంక్ అకౌంట్స్ ఫ్రీజ్ చేసి కోటి 20 లక్షల నగదు హెూల్డ్ చెయ్యమని బ్యాంక్ లకు అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. హాంకాంగ్ కి చెందిన లీసా అనే మహిళ ద్వారా ఈ మోసం జరిగిందనీ పోలీసులు గుర్తించి నిందితులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నెల్లూరు జిల్లా ఎస్పీ సిహెచ్ విజయ రావు మాట్లాడుతూ యువతనే ప్రధానంగా టార్గెట్ చేస్తూ సైబర్ మోసాలకు పాల్పడుతున్న వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురిని అరెస్టు చేసి వీరిని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయని సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్లకు లింకు లు పంపుతూ వీటిని ఓపెన్ చేయడం ద్వారా లిజ నింగ్ యాప్ ద్వారా మన ఫోన్లో ని డేటా తో పాటు కాంట్రాక్ట్ లిస్ట్ మొత్తం సైబర్ నేరగాళ్ల కు చేరిపోతుందని దీంతో వారు ఫొటోలు మార్ఫింగ్ చేయడం, అకౌంట్‌లలో నగదు దొంగిలిం చడం మనకు తెలిసిన కాంట్రా క్ట్స్ ద్వారా బెదిరించడం లాంటి పనులకు పాల్పడే వారని తెలిసింది. సైబర్ నేరగాళ్లు ఓపెన్ చేసిన 29 అకౌంట్‌ల ద్వారా 34 కోట్ల రూపాయాలను సీజ్ చేశామని వివిధ రకాల పేర్లతో 12 కంపెనీలను ఓపెన్ చేయడం ద్వారా పలువురిని మోసం చేశారని లీసా అనే విదేశీ మహిళ ఫిలిప్పీన్స్ హాంకాంగ్ దేశాల ద్వారా ఇన్ స్టా గ్రామ్ అనే సోషల్ ప్లాట్ ఫారం ద్వారా వివిధ రకాల మెసేజ్ లు పంపుతూ వర్క్ ఫ్రమ్ హోం అనే మెసేజ్ ద్వారా ఫోన్ ను హ్యాక్ చేస్తూ, ఎస్ఎంఎస్ లిజనింగ్ ఆప్ ద్వారా మీ మొబైల్ లో ఇన్‌స్టాల్ అయి ఫోన్ లోని ఫొటోలు, డేటా మొత్తం మోసగాళ్ల చేతిలోకి వెళ్లి పోతాయని నగరాల్లో యువత ఎక్కువగా ఈ ముఠా బారిన పడుతున్నారని ఈ విషయాల దృష్టిలో ఉంచుకొని యువత జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సిహెచ్ విజయరావు తెలిపారు. ఈ సైబర్ కేసు ఛేదించడంలో ప్రధాన పాత్ర వహించిన నెల్లూరు జిల్లా క్రైం ఏఎస్పి చౌడేశ్వరి తో పాటు ఉదయగిరి సీఐ గిరిబాబు,బాలాజీ నగర్ సిఐ రాములు నాయక్ ,సైబర్ టీం సిబ్బందికి ఎస్పీ విజయరావు నగదు ప్రోత్సాహకం తో పాటు ప్రశంసా పత్రాలు అందించారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: సర్వేపల్లి నియోజ క వర్గం, పొదలకూరు మండలం, తాటిపర్తి 1వ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా, 2వరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పర్యటించారు. గడప గడపకు మన ప్రభుత్వం లో భాగంగా కాకాణి పర్యటనలో టీడీపీనాయకుడు కొమర రమణ య్య తో పాటు 80 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైసీపీలో చేరారు.

ముగిసిన టిఎఆర్ఎల్ శిక్షణ: ఎంఈఓ

విశాలాంధ్ర- రాపూరు: దక్కిలి లో జరిగిన టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్ (టిఎఆర్ఎల్) ఉపాధ్యాయు శిక్షణ తరగతు లు శనివారం ముగిశాయని కోర్స్ డైరెక్టర్ మండల విద్యా శాఖ అధికారి కిల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. దక్కిలి మండల విద్యాశాఖాధికారి కిల్లా వెంకటే శ్వర్లు మాట్లాడుతూ టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్ శిక్షణా తరగ తులు మొదటివిడత ఈ నెల 17వ తేదీ నుండి 20వ తేదీ వరకు 26మంది ఉపాధ్యాయు లకు, రెండవ విడత ఈ నెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు 26మంది ఉపాధ్యాయులకు మొత్తం 52 మంది ఉపాధ్యాయులకు(టిఏఆర్ఎల్) ప్రోగ్రామ్ కింద శిక్షణ ఇచ్చారని మిగతా టీచర్స్ కి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మూడో విడత శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు. మండల శిక్షణ పొందిన ప్రతి ఉపాధ్యాయులు పాఠశాల స్థాయిలో 3,4,5, తరగతులకు తెలుగు లోచదవడం,రాయడం గణితం లో చతుర్విధ ప్రక్రియలు (కూడికలు, తీసివేతలు, గుణ కారం, భాగహారం)ప్రతి విద్యార్థి నేర్చుకొనేటట్లు కృషి చేయాలనీ ఉపాధ్యాయులకు ఆదేశించా రు. రెండువిడతల శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు స్వల్ప విరామ సమయంలో టీ బిస్కట్స్ సమోసా, వడ, మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారని ఉపాధ్యాయులకు చక్కగా ట్రైనింగ్ ఇచ్చిన రిసోర్స్ పర్సన్స్ ను ఎంఈఓ అభినందించారు. ఈ కార్యక్రమం లో దక్కిలి కాంప్లెక్స్ చైర్మన్, దక్కిలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెల్లూరు సుబ్రహ్మణ్యం, రిసోర్స్ పర్సన్స్ కర్ణాటకం నాగమోహన్, దూడల పెంచలయ్య, బిఆర్‌పిలు ఎస్.బి రమేష్, మేరిగా జగదీశ్వర య్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2024 నాటికి ప్రతి కుటుంబానికీ సురక్షిత తాగు నీరు అందించాలి

- జిల్లా అధికారులకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: జల్ జీవన్ మిషన్ ద్వారా 2024 నాటికి ప్రతి కుటుంబానికి సురక్షిత తాగు నీరు అందించాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాన్ని సాధించడానికి సంబంధిత అధికారులందరు సమన్వయంతో కలసికట్టుగా కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి సూచించారు. శనివారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్ అమలు, సమన్వయం పై ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజనీర్లు, అమలు సహాయ సంస్థలకు కార్యశాల (వర్క్ షాప్) ఏర్పాటు చేశారు. తొలుత కార్యశాల ముఖ్యోద్దేశంను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రంగవర ప్రసాద్ వివరిస్తూ జల్ జీవన్ మిషన్ పథకం లక్ష్యం ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీటి కుళాయిని అందించడమే అన్నారు. తద్వారా ప్రజల జీవన ప్రమాణా లను మెరుగు పరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో గ్రామీణ నీరు మరియు పారిశుధ్య కమిటీలను ఏర్పాటు చేసుకొని ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలన్నారు. ఆయా కమిటీల ద్వారా గ్రామీణ నీటిసరఫరా పథకాలను సమర్థవంతంగా నిర్వహించడం, యాజమాన్యీకరించటం, అమలు చేస్తామన్నారు. ఈ కార్యశాలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ గ్రామ స్థాయిలో పటిష్టంగా అమలు చేసి, ప్రతి కుటుంబానికి సురక్షిత త్రాగు నీటి కుళాయిని అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. గ్రామ స్థాయిలో అమలు చేసే ప్రతి కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం పెంపొం దించేం దు కు అవగాహ నా కార్యక్ర మాలు ఏర్పాటు చేయా లన్నారు. గ్రామ స్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసుకుని నీటి నాణ్యతా యాజమాన్యం, నీటి పరిశుద్దీకరణ నిర్మాణం, నిర్వహణ కు అవసరమైన నైపుణ్యాలు కల్గిన మానవ వనరులను మెరుగు పరుచుకోవాలన్నారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివరెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి రోజుకి 55 లీటర్ల నీటిని అందించే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన జల్ జీవన్ మిషన్ కార్యక్రమమును పటిష్టంగా అమలు చేయుటకు అధికారులందరూ కలసికట్టుగా కృషి చేయాలన్నారు. జలం లేనిదే జీవం లేదనే ఆర్యోక్తికి అనుగుణంగా అందరికీ సురక్షిత నీటిని అందించడానికి ఏర్పాటు చేసిన కార్యశాలను సద్వినియోగం చేసుకుని సంబంధిత ఇంజనీర్లు పథకం అమలుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పివో డాక్టర్ మంద రాణి, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, వివియస్ శర్మ పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో అన్నదానం

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు లోని మహావిష్ణువు, అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 26 వ తేది నుండి డిసెంబర్ 5 వరకు జరుగుతున్న అన్నదానం లో శనివారం రాపూరు పట్టణంలోని జిపి పాఠశాల కరస్పాండెంట్ బొలిగ ర్లశివకుమార్, శ్రీలక్ష్మీ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా మహావిష్ణువు పాదాల చెంత కార్తిక మాసం అంతా గోత్ర నామాలు, ప్రత్యేక పూజలు సాయంత్రం మంత్రోచ్చారణలతో ఆకాశ దీపారాధన, నవంబర్ 1 వతేది సామూహిక సత్యనారాయణ వ్రతం,14వ తేది ఆలయ ప్రాంగణం లో అయ్యప్ప స్వామి మకరపూజ నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మా గోడు పట్టదా?

- కనీస సౌకర్యాలు కరువు - వీధి దీపాల ఊసే లేదు
- తాగునీటి కోసం విలవిల- పెద్దపల్లె పాలెం వాసుల ఆవేదన

విశాలాంధ్ర- ఉలవపాడు: సౌకార్యాలు బాగా పెరిగి ప్రజలకు అన్ని అందు బాటు లో ఉండాలని గ్రామ సచి వాలయం ని ఏర్పాటు చేసి వాలంటీర్ వ్యవస్థను బలో పేతం చేసే ప్రతి ఒక్కరికి కనీస సదుపాయాలు అయినా వీధి దీపాలు, తాగునీరు ఇంటింటికి రేషన్, వాలంటీ ర్ల ద్వారా పెన్షన్ పంపిణీ తదితర విషయాలను గడప గడపకు అందించే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినప్పటికీ మండల పరిధిలోని కరేడు పంచాయతీకి చెందిన పెద్దపల్లి పాలెం పంచాయతీ దూరంగా ఉండటం పంచాయతీ, గ్రామానికి మధ్యలో ఛిల్లా కాలువ ఉండటం తో తమ గోడును వినిపించుకోవడానికి లేదా తమకు సౌకర్యాలు కల్పించాలని కోరుకోవడానికి తమ మండల పంచాయతీ చేరుకోవాలంటే సుమారు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవలసి ఉంటుంది . అక్కడ నివసించే ప్రజలు కనీసం తాగు నీరు కూడా సరిగా అందడం లేదు. వారు చాలా దూరం గా ఉండటం తో అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ తమ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచి నీటి కోసం రోజులు రోజులు ఎదురు చూడలేక 10 కిలోమీటర్లు దూరం నుండి బబుల్స్ సహాయం తో మినరల్ వాటర్ తెచ్చుకున్తున్నామని దీనంగా వాపోతు న్నారు. అక్కడ ఉన్న ప్రజలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటూ చాలా దుర్భరమైన జీవితం గడుపు తున్నారు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని తమ ప్రాంత ప్రజలకు న్యాయం చేసి కనీస సౌకర్యాలు కలిపించాలని స్థానికులు కోరుతున్నారు.

రూరల్ ఎమ్మెల్యేకి సీమాంధ్ర విద్యార్థి యువజన జేఏసీ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగర నడిబొడ్డున ఎన్నో సంవత్సరాలుగా స్థాపించిన ప్రఖ్యాత విద్యా సంస్థ డీకే డబ్ల్యు కళాశాల అని సీమాంధ్ర విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దేవి ప్రసన్న అన్నారు. అలాంటి కళాశాల అభివృద్ధి కోసం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా ఆమె రూరల్ ఎమ్మెల్యేను అభినం దించారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆ దిశగా విద్యాలయాలలో మౌలిక వసతులు ఉండాలని విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు మంచి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. తాము కోరిన వెంటనే కళాశాలలో క్రీడా మైదానం, క్రీడా పనిముట్లు ఏర్పాటు చేయడం సంతోష మన్నారు. ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను సైతం భర్తీ చేస్తానని హామీ ఇవ్వడం, కళాశాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకుంటాననడం ఒక కోటి ఒక లక్ష రూపాయల తో డీకేడబ్ల్యు జూనియర్ కళాశాల నాడు నేడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం సంతోషదాయకమన్నారు. రూరల్ నియోజక వర్గంలో అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలను అన్ని రకాలుగా అభివృద్ధి పరచాలని ఆమె కోరారు.

వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్నెల్, నెల్లూరు వారి ఆధ్వర్యం లో కె.ఏ.సి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువతకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, కమ్యూనికేషన్స్ స్కిల్స్ పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధికల్పనాధికారి ఎ. సురేష్ కుమార్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ కెరీర్‌ను సాధించుకోవాలంటే కృషి, పట్టుదలతో పాటు 3 సూత్రాలైన చదవడం, రాయడం స్పష్టంగా మాట్లాడడం లను పాటించినట్లయితే వారు సమాజములో మంచి ఉన్నత స్థానాలను పొందవచ్చునని తెలిపారు. సురేష్ బాబు, సైకాలజిస్ట్ మాట్లాడుతూ యువత తమ భవిష్యత్ ప్రణాళికలను రూపొం దించుకుని వాటిని సాధించేందుకు గాను 21 రోజులు వారి ఎంచుకున్న లక్ష్యాలను పేపరుపై వ్రాసి పదే పదే స్మరించు కుంటూంటే వారు అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా చేరుకో గలరని అదేవిదంగా ప్రతి ఒక్కరు పాజిటీవ్ ఆలోచించినట్లయితే వారు అన్ని రంగాలలో రాణించ గలరని తెలియజేశారు. డి. పుల్లయ్య, ముఖ్యకార్య నిర్వహ ణాధికారి, సెట్నెల్ వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి కెరీర్ ఉన్నతికి వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిలకు గల అవశ్యకతను గుర్తించి పట్టుదలతో కనీసము నాలుగు గంటలు సాధన చేస్తే వారు అనుకున్న లక్ష్యాలను సాధించగలరని తెలియజేశారు. ప్రిన్సిపాల్ గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వము వారు నేరుగా మన వద్దకు వచ్చి విద్యార్థులకు వారి కెరీర్‌ను పెంపొం దించుకునే మార్గాలను, విధానాలను అనుసరిం చినట్లయితే ప్రతి ఒక్కరు జీవితములో స్థిరడతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మునిరాజు, యన్.యస్.యస్. కోఆర్డినేటర్, కె.ఏ.సి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెల్లూరు, యం.డి. గయాస్రుహ్మద్, సూపరింటెండెంట్, బి. శ్రీనివాసరావు, మేనేజర్, సెట్నెల్, కళాశాల, పెట్నెల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాకాని చిత్రపటానికి పాలభిషేకం

విశాలాంధ్ర-ముత్తుకూరు: రాష్ట్ర వ్యవసాయ , మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చిత్రపటానికి తాళ్లపూ డి, బ్రహ్మదేవం గ్రా మాలలో ఆయన చిత్ర పటానికి పార్టీ నాయ కులు కార్యకర్త లు పాలాభిషేకం శనివా రం చేశారు.. ఈ సందర్భంగా తాళ్లపూడి ఉప సర్పంచ్ అల్లంపాటి గోపాల్, మెట్ట యువసేన నాయకులు దువ్వూరు హరికృష్ణ, బ్రహ్మ దేవమ్ నాయకులు మస్తాన్, జమీల్ బాషా, జడ్పిటిసి సభ్యులు బందుల వెంకట రమణయ్య మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు ప్రభావిత గ్రామాల ప్రజల కోసం అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మత్స్య కార్యతర ప్యాకేజీ మంజూరు చేయించాడన్నారు. అనంతరం వచ్చిన ముఖ్యమంత్రి దాన్ని పంపిణీ చేయకుండా ప్రతి ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ప్యాకేజీని పంపిణీ చేస్తామంటూ ప్రజల చేత ఓట్లు వేయించుకుని పలుమార్లు మోసం చేశారన్నారు. అయితే గత ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలోని ప్రతి ఒక్కరికి మత్స్య కార్యతర ప్యాకేజీ అందజేస్తానని ఎన్నికల హామీగా మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటను ఆయన నిల బెట్టుకుని ఈనెల 27వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా మటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశార న్నారు. అందువల్లే గ్రామ గ్రామాన ఆయన చిత్రపటానికి పాలాభిషేకాలు చేస్తున్నా మనీ వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పా ల్గొన్నారు.

అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర- మర్రిపాడు: అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీలలో మండలం నుంచి వివిధ క్రీడల్లో విద్యార్థులు పాల్గొని నియోజకవర్గ స్థాయిలో ఎంపికయ్యారు. మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఆటల పోటీలలో మర్రిపాడు, కేజీబివి బాలికల పాఠశాల, పొంగూరు, పోలిరెడ్డిపల్లి,నందవరం మోడల్ స్కూల్, టిఎస్ పేట పాఠశాలలు పాల్గొన్నాయని పిఇటి సతీష్ వెల్లడించారు. పోటీలలో భాగంగా కోకో, కబడ్డీ, త్రో బాల్,వాలీబాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించగా మర్రిపాడు ఉన్నత పాఠశాల నుండి 20మంది, టిఎస్ పేట 10 మంది పోలిరెడ్డిపల్లి పాఠశాల నుండి 10మంది చొప్పున పొంగూరు పాఠశాల నుండి 6 మంది, కేజీబీవీ నుండి 8 మంది బాలికలు, నందవరం మోడల్ స్కూల్ 7 మంది నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక య్యారన్నారు. నవంబర్ 7వ తేదీన నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో సత్తా చాటిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

పదోన్నతి సూపరింటెండెంటు 1ఇంజనీరుకు అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ గా పనిచేస్తూ ఈ రోజు పదోన్నతి పై చీఫ్ జనరల్ మేనేజర్ గా కార్పొరేట్ తిరుపతిలో నూతన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్స్,సిబ్బంది మరియు ట్రేడ్ యూనియన్ నాయకులు,అసోసియేషన్ నాయకులు తిరుపతిలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ తిరుపతి కి విచ్చేసి తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను ఎస్ఈ గా దాదాపు 5 సంవత్సరాలు పనిచేశానని ఈ సందర్భంగా తనకు సహకరించిన ఆఫీసర్స్ కు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ఉచితవైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: మండలంలోని వలేటివారిపాలెం పంచాయ తీ కార్యాలయం ఆవరణలో రెండవ రోజు కంచ ర్ల సుధాకర్ యోధా డయా గ్నోస్టిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో జరుగుతున్న రొండవ రోజు కూడా ఉచితవైద్య సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం కూడా వలేటివారిపాలెం పంచాయతీ ఆవరణలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య సేవలు కొనసాగుతాయని ఈ అవకాశాన్ని మండ ల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలిరోజు రక్త పరీక్షలు. ఈసీజీ కళ్ల పరీక్షలు సుమారు 270 మంది పరీక్షలు చేయిం చుకున్నారని రొండవరోజు కూడా 267 మంది ఉచిత వైద్య పరీక్షలు చేయించు కున్నారన్నారు. వారిని ఆదివారం, సోమవారం డాక్టర్ పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారని వారు తెలిపారు.

పట్టుభద్రుల ఓటు నమోదు పై అవగాహన

విశాలాంధ్ర -మనుబోలు: శ్రీ సేవా నాదం ట్రస్ట్ వ్యవస్థాపకులు మాచిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ట్రస్టు సభ్యులు శనివారం మనుబోలు మండల వ్యాప్తంగా అన్ని హైస్కూల్‌లో పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన నిర్వహిం చారు. మనుబోలు ,మడమనూరు, బద్వేలు ,అక్కంపేట గ్రామాలలో పర్యటించి అవగాహన కల్పించారు . ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ తాము మనుబోలు మండల వ్యాప్తంగా మూడు వందలకు పైగా ఓట్లు నమోదుకై తమవంతు కృషి చేశామన్నారు. పదిహేను నుంచి ఇరవై మంది పట్టు భద్రులు ఓటు కోసం పనిచేస్తున్నారని, నెల్లూరు, చిత్తూరు, జిల్లాల్లో తమ స్నేహితులు సహ ఉద్యోగులు ద్వారా ఒక చైన్ పద్ధతిలో ఇప్పటికే వెయ్యికి పైగా ఓట్లు ఈ కార్యక్ర మంలో భాగంగా నమోదు అయ్యాయని ట్రస్టు సభ్యులు తెలిపారు. శ్రీనాథ్ రెడ్డి చేస్తున్న ఈ అవగాహన కార్యక్రమం అభినందనీయమని అన్నీ స్కూల్ ప్రధానో పాధ్యాయులు ప్రధానో ఉపాధ్యాయురాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గిరి, పవన్, సురేష్ శ్రీకాంత్, శ్రీను శేషారెడ్డి, భార్గవ, మహిధర్, ప్రేమ్ ,ఆషిక్, నిరంజన్ పాల్గొన్నారు.

వీఎస్‌యు డిగ్రీ ఐదవ, ఆరవ అడ్వాన్స్ సప్లమెంటరీ సెమిస్టర్ పరీక్షలు

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలో అక్టోబర్ 27 నుంచి డిగ్రీ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు మొదలయ్యాయి. 299న ఉదయం జరిగిన డిగ్రీ ఐదోవ సెమిస్టర్ పరీక్షలో మొత్తం 116 మంది విద్యార్థులు గాను 114 మంది విద్యార్థులు హాజర య్యారు. ఈ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఆరవ సెమిస్టరు పరీక్షలో మొత్తం 38 మంది విద్యార్థులకు గాను 37 మంది విద్యార్థులు హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రం విఆర్‌ఐఏఎస్ నెల్లూరులో ఒక విద్యార్థి డీబార్ అయ్యారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కోవిడ్ 19 నిబంధనలను పాటిస్తూ విద్యార్థులను పరీక్షా కేంద్రం లోనికి అనుమతించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మాస్కును తప్పనిసరి చేస్తూ భౌతిక దూరం పాటిస్తూ పరీక్షలు నిర్వహించామని పరీక్షల నిర్వాహణాధికారి డాక్టరు ఆర్.ప్రభాకర్ తెలిపారు.

సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్ర మంలో భాగంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇచ్చిన హామీ ల్లో భాగంగా నెల్లూరు రూరల్ నియోజక వర్గం పరిధిలోని 21 డివిజన్లో 10 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రహదారులకు కొత్త రూపు తీసుకొస్తున్నామన్నారు. నెల్లూరు రూరల్ పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించి ఆదర్శవంతంగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చేజర్ల మహేష్, చేజర్ల కవిత పాల్గొన్నారు.

తల్లి దండ్రులని చంపేందుకు సుఫారీ ఇచ్చిన కసాయి కొడుకు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: పోలీసుల సమయస్ఫూర్తి తో నిలిచిన రెండు నిండు ప్రాణాలు,తల్లితండ్రులని చంపేందుకు సుఫారీ ఇచ్చిన కసాయి కొడుకు... కుట్రను కావలి రూరల్ పోలీసులు భగ్నం చేశారు. తండ్రిని చంపితే 3లక్షలు, తల్లిని చంపితే ఐదు లక్షలు సుఫారి. కత్తులు కొన్నాడు. కారులో పెట్టాడు. రెక్కీనిర్వహించారు. కావలికి చెందిన ఈ నరరూప రాక్షసుడి పేరు మురుసు లక్ష్మి నారాయణ, పలు చోరీ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న ఇద్దరు నేరస్తులను బుచ్చిరెడ్డిపాలెం పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రెండు లక్షల 95 వేల రూపాయలు విలువ చేసే 94 గ్రాములు బంగారం, 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా భార్యా భర్తలు ఇద్దరినీ హత్యచేయడానికి కూడా పథకం వేసినట్టు వెల్లడించారు. దీంతో హత్యల కుట్రను భగ్నం చేశారు. నెల్లూరు నగరంలోని ఉమేష్ చంద్ర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం మీడియా సమావేశం నిర్వహించిన నెల్లూరు జిల్లా ఎస్పీ విజయరావు కేసుకి సంబంధించిన పూర్తి వివరాలు తెలిపారు. ముత్తుకూరు మండలానికి చెందిన షేక్ గౌస్ బాషా, బుచ్చి రెడ్డి పాలెం పట్టణానికి చెందిన షేక్ షాహుల్ అనే ఇద్దరు నేరస్తులు పలు దొంగతనాలు కేసుల్లో నిందితుగా వుండి జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో జైల్లో కావలి పట్టణానికి చెందిన షేక్ షఫీ అనే వ్యక్తి తో పరిచయమైనట్టు, కావలి పట్టణానికి చెందిన మురుసు లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఆస్తి వాటా పంపకాలలో తన తల్లిదండ్రులు తనకు అన్యాయం చేశారని వారిద్దరినీ హత్య చేస్తే తండ్రిని చంపినందుకు మూడు లక్షలు, తల్లిని చంపితే 5 లక్షలు ఇచ్చే విధంగా సుఫారీ ఇస్తాడని కావలికి చెందిన షేక్ షఫీ మిగతా ఇద్దరు గౌస్ బాషా,షేక్ షాహుల్ కు తెలియ చేయగా లక్ష్మీనారాయణ తల్లిదండ్రులు ను హత్య చేయుటకు ముగ్గురూ కలిసి రెక్కీ ఆటో లో పలు దఫాలు నిర్వహించినట్లు,ఈ క్రమంలో హత్యకు ఉపయోగించుట కు కత్తులు కూడా కొని లక్ష్మీ నారాయణ కు చెందిన స్విఫ్ట్ డిజైర్ కార్ లో ఉంచినట్టు, దొంగతనం కేసులో ముద్దాయిలని అరెస్ట్ చేయగా హత్యకు సంబంధించిన విషయాలు కూడా బయటకు వచ్చినట్టు దీంతో కార్ తో పాటు కత్తులు కూడా స్వాదీనం చేసుకున్నామని,, దొంగతనం కేసు ఛేదిం చడంతోపాటు రెండు హత్యలను ఆపడంలో బుచ్చిరెడ్డి పాలెం పోలీసులు కావలి రూరల్ పోలీసులు ఉత్తమ ప్రతిభ చూపారని వారిని అభినందించిన ఎస్పీ అభినం దించారు.

కన్నుల పండువగా పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండలం లోని పెనుశిల లక్ష్మీనర సింహ స్వామి కళ్యా ణ మహోత్సవం పండితులు నాగరాజు స్వామి వేద మంత్రా లతో అంగ రంగ వైభవంగా స్వామి వారి నిత్య కళ్యాణం మండపంలో నిర్వహించారు. శనివారం ఉదయం 5గంటలకు స్వామికి ప్రధాన అర్చకులు సీతా రామయ్యస్వామి, పెంచల పెంచలయ్య స్వామి, అర్చకులు శశిస్వామి, త్రినాధ్ స్వామి, నాగ రాజు స్వామి, వినోద్ స్వామి, మల్లికార్జున స్వామి, మధుస్వామి, సాయి స్వామి, తదితర అర్చకుల, పండితుల వేద మం త్రాల నడుమ స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలలో స్వామిని భక్తులు నేత్రా నందంగా, నయనా నందకరంగా దర్శించుకున్నారు. ఉదయం 10 గంటలకు స్వామి వా రి నిత్య కళ్యాణ మండపంలో మేళతాళాల మధ్య పండితుల వేద మంత్రాల నడుమ స్వామి కళ్యాణాన్ని నయనా నందకరంగా భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం దీపాలం కరణ సేవ, స్వామికి తిరుచ్చి ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పాలక వర్గ చెర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, అలయ అసిస్టెంట్ కమిషర్, కార్యనిర్వహణ అధికారి జోల్లు వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించారు.

పార్టీ గెలుపునకు యూనిట్ ఇన్‌చార్జిల కృషి ఎంతో అవసరం

- కావలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మాలేపాటి

విశాలాంధ్ర - కావలి : టీడీపీ గెలుపునకు యూనిట్ ఇన్‌చార్జిల కృషి ఎంతో అవసరమని కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. శనివారం సుబ్బానాయుడు అధ్యక్షతన కావలి టీడీపీ కార్యాలయంలో 3వ క్లస్టర్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు ప్రతి ఒక్కరితో మాట్లాడి టీడీపీ గెలుపునకి తమ వంతుగా అందించు సలహాలను స్వీకరించారు. ప్రతి కార్యకర్త రోజులో ఒక గంట పార్టీకి పనిచేస్తే మన గెలుపు సులభతరం అవుతుందని వచ్చిన వారికి సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల చేర్పులు గురించి ప్రతి ఒక్కరు భాద్యత తీసుకొని క్లస్టర్ పరిధిలోని బూత్ ఇంచార్జ్ లు సమిష్టిగా కృషి చేసి, ఓటు అర్హత ఉన్న వారి అందరినీ పట్టభద్రుల ఎన్నిక ఓటర్ల జాబితాలో నమోదు చేయా లని సూచించారు. ఈ సమావేశంలో కావలి పట్ట ణ టీడీపీ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి బొగ్గవరపు శ్రీనివా స రావు, యూనిట్ ఇన్చార్జులు కావేటి శివ కుమార్, షేక్ షానవాజ్, మల్లెల రమణయ్య, తటవర్తి వాసు, జ్వాల చంద్రశేఖర రావు, కావేటి చిన్నకోటయ్య, పల్లపు కుమార్, పల్లపు మోహన్, పల్లపు ప్రసాద్, పసుపులేటి చంద్రశేఖర్, ప్రళయకావేరి కృష్ణారావు పాల్గొన్నారు.

కరేడు కస్తూరిబా హాస్టల్ లో విద్యార్థికి పాము కాటు

పీహెచ్‌సి మూతతో అందని ప్రాథమిక చికిత్స

విశాలాంధ్ర- ఉలవపాడు: అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లుగా తయారుఅయింది కరేడు లో ప్రభుత్వ అధికారుల పనితీరు ..ఈమధ్య కాలం లో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి మెరుగైన సదుపాయాలు ఏర్పాటు చేసి లక్షల వ్యయంతో కరేడు లోని కస్తూరిబా బాలికల పాఠశాలలో అన్ని ఏర్పాట్లు సమకూర్చారు. కానీ కొందరి అధికారుల నిర్లక్ష్యం పేద విద్యార్థులకు శాపం గా మారింది. విద్య అందించడంలో కొంతమేరకు కృషి చేస్తున్న ఆరోగ్య సమస్యలు తరచూ వేధిస్తున్నాయి. దానికి తోడు చుట్టూ మరుగుగా ఉండటంతో పురుగు పుట్ర సర్వసాధారణంగా కనిపిస్తున్నాయి. అయితే శుక్రవారం సాయంత్రం అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఒక బాలికకు పాము కాటు వేయడంతో వెంటనే స్పందించిన ఆ పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయురాల, మరొకరు సహాయంతో కరేడు ప్రాథమిక వైద్య కేంద్రానికి హుటాహుటిని తీసుకువెళ్లారు. కానీ అక్కడ సిబ్బంది ఎవరూ లేక తలుపులు మూసి వేయడంతో చేసేది ఏమీ లేక సాయంత్రం అందరూ మహిళలే కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్థానికుల సహాయంతో బైకుపై ఉలవపాడు తీసుకొచ్చే ప్రయత్నం చేయగా మధ్యలో రైల్వే గేట్ పడి ఉండటం మరింత ఆందోళన కలిగించింది. అయితే ఎట్టకేలకు ఉలవపాడు ఆసుపత్రికి తీసుకుని వచ్చి అక్కడ నుంచి ఒంగోలు తరలించారు. అయితే అక్కడ వైద్యులు వెంటనే స్పందించి చికిత్స అందించడంతో బాలిక క్షేమంగానే ఉందని తెలియ వచ్చింది . అయితే ఇలాంటి సంఘటన వల్ల ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఆసుపత్రి మూయటం వల్ల ఒకవేళ ఆ బాలికకు ఏమైనా జరిగి ఉంటే ఈ బాధ్యత ఎవరు భరించాలి? ఆ తల్లిదండ్రులకు ఏమని సమాధానం చెబుతారు? అనే విషయం సంఘటన జరిగినా అనంతరం స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వైద్యశాలలో 24 గంటలు వైద్య సేవలు అందేలా చర్యలు చూడాలని అధికారులు వేడుకుంటున్నారు ఇంత జరుగుతున్నా వైద్య సిబ్బంది మాత్రం తమకు ఏమీ పట్టనట్టు గుట్టుచప్పుడు కాకుండా వున్న ధోరణిలో ఉండటం చర్చనీయాంశంగా మారింది.

అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ పోలీసు బ్యాండ్ షో

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: పోలీసు అమర వీరుల వారోత్సవాల సందర్భంగా నెల్లూరు టౌన్ లోని గాంధీ బొమ్మ వద్ద బ్యాండ్ షో ప్రదర్శన నిర్వహించారు. పోలీస్ బ్యాండ్ బృందాన్ని యస్.పి విజయరావు అభినందించారు. విధి నిర్వహణలో అమరులైన సిబ్బంది త్యాగాలను, వారి సేవా తత్పరత గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ పోలీసు బ్యాండ్ ప్రదర్శన నిర్వహించామన్నారు. అసువులు బాసిన పోలీసు శాఖ అధికారులు, సిబ్బందికి ఈ ప్రదర్శన అంకితం అన్నారు. పోలీసు వాయిద్య బృందం సభ్యులు పోలీసు శౌర్యాలకు సంబంధించిన జాతీయ గీతాలాపన, దేశభక్తి గీతాలు ఆలపించారు. విధి నిర్వహణలో సేవా తత్పరతను కనబరిచి అమరులైన సిబ్బంది స్పూర్తిని మనలో నింపుకోవాలని, శాంతియుత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని, పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ వారికి నివాళులు అర్పించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, ఇంచార్జి టౌన్ డిఎస్పి, టౌన్ ఇన్స్పెక్టర్స్, ఆర్ఐలు, ఏఆర్ఎస్ఐ ఇమామ్ ఆధ్వర్యంలోని బ్యాండ్ బృందం, ఇతరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్స్ శ్మశాన వాటిక నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధి లోని అల్లిపురం లో రూ. 2.14 కోట్లతో అత్యంత ఆధునాతనంగా నిర్మించిన క్రిస్టియన్ల శ్మశాన వాటిక నిర్మాణ పనులను వైసిపి రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నెల్లూరు నగర మేయర్ పోట్లూరి స్రవంతి తదితరులు శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి నవంబర్ 2న దీనిని ప్రారంభించేందుకు తీసుకోవలసిన ఏర్పాట్లను కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నేత కోడూరు కమలాకర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసు నాయుడు, హరిబాబు యాదవ్, జయవర్ధన్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర- కందుకూరు: పట్టభద్రులు తమ ఓటును నవంబర్ 7వ తేదీ లోపు నమోదు చేయించుకోవాలని ఎస్టీయు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సిహెచ్ ఆదినారాయణ కోరారు. శనివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ టి యు, సిపిఐ, ఏఐవైఎఫ్ కార్యకర్తలు అర్హత కలిగిన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి మాలకొండయ్య మాట్లాడుతూ త్వరలో జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటుహక్కు కలిగి ఉండాలంటే పట్టభద్రులు విధిగా తమ ఓటును నమోదు చేయించుకోవాలని కోరారు. సిపిఐ కార్యాలయంలో ఓటర్ల నమోదు సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సిపిఐ కార్యకర్తలు ఏఐవైఎఫ్ కార్యకర్తలు పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు రాష్ట్ర నాయకులు అశోక్ బాబు జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు సహాయ కార్యదర్శి పి బాలకోటయ్య హుస్సేన్ ఏఐవైఎఫ్ నాయకులు దుర్గాప్రసాద్ పలువురు ఎస్టియు నాయకులు పాల్గొన్నారు.

రామస్వామి ని అభినందించిన సీపీఐ జిల్లా కార్యదర్శి

విశాలాంధ్ర - కావలి : కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో అందించిన సేవలకు రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరి చందన్ నుండి బంగారూ పతకం అందుకున్న డాక్టర్ రామస్వామి ని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య అభినందించారు. శనివారం పట్టణంలోని కందుకూరి హాస్పి టల్ లోఎంతో డాక్టర్ రామస్వామి ని కలసి పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా దామా అంకయ్య మాట్లాడుతూ కోవిడ్ బాధితులకు తన ఆసుపత్రి కేంద్రంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని అన్నారు. నెల్లూరు జిల్లా నుండి ఈ అవార్డు అందుకున్న ఏకైక వ్యక్తి రామస్వామి అని ప్రశంసించారు. ఎంతో మంది నిరాశ్రయులకు ఇల్లు నిర్మించడం, పేదల ఆకలి తీర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, అందరికీ సహాయం చేస్తున్న రామస్వామి మున్ముందు మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గా బాబు పాల్గొన్నారు.

నవంబరు లోపు 10 లక్షల మొక్కలు నాటాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: జిల్లా వ్యాప్తంగా 10 లక్షల మొక్కలను వచ్చే నవంబర్ లోపు నాటి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో జిల్లా అటవీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 33 శాతం పచ్చదనానికి 20 శాతం పచ్చదనం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ సంవత్సరం పచ్చదనం పెంపొందించేందుకు 10,440 హెక్టార్లలో కనీసం 10 లక్షల మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం అన్ని ప్రభుత్వ శాఖలు తమ వంతు సహకారం అందించాలన్నారు. వారికి కేటాయించిన నిర్ణీత లక్ష్యాలను నవంబర్ మాసంతంలోగా సాధించేందుకు కృషి చేయాలన్నారు. అటవీ సెటిల్మెంట్ అధికారి రెవెన్యూ శాఖల సమన్వయంతో రిజర్వ్ ఫారెస్ట్ లో కూడా కార్యాచరణ ప్రణాళిక ద్వారా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్నారు. జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న అన్ని జగనన్న కాలనీలలో మొక్కల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. ప్రతి ఇంటి వద్ద ఒక మొక్క తప్పనిసరిగా నాటించాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, భవనాల ప్రాంగణాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కల పెంపకంలో గ్రామ సచివాలయ సిబ్బందిని ప్రభుత్వేతర సంస్థలను కూడా భాగస్వాములు చేయాలన్నారు. ప్రతి మొక్కను నాటడం తో పాటు దానికి సంరక్షణ ఏర్పాట్లు కూడా తప్పని సరిగా చేసి ఫొటోతో సహా నివేదికలు పంపించాలన్నారు. అన్ని చెరువుల చుట్టూ మొక్కలను పెంచా లన్నారు. నూనె, ఇందన, సిమెంటు ఉత్పత్తి కేంద్రాల వద్ద కాలుష్య నియంత్రణ కోసం తప్పనిసరిగా మొక్కల పెంపకం విరివిగా చేపట్టాలన్నారు. అంతకుముందు సామాజిక వన విభాగం డివిజనల్ అధికారి శ్రీనివాసులు జిల్లాలోని నర్సరీలు, అటవీ విస్తీర్ణం, పచ్చదనం పెంపుదల తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి హరిత, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా అటవీ అధికారి చంద్రశేఖర్ ,జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ ధనలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకరరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ రంగ ప్రసాదరావు, ఏపీఎంఐపి, డ్వామా, గృహ నిర్మాణ సంస్థ పిడిలు శ్రీనివాసరావు, వెంకట్రావు, నాగరాజు, ఉద్యాన శాఖ ఏడి సుబ్బారెడ్డి,డీఈవో రమేష్, డిసిఓ తిరుపాల్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాజశేఖర్, కావలి సబ్ డిఎఫ్ఓ రాజశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరులో కుళ్లిపోయిన కోడి మాంసం విక్రయాలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరులో కుళ్లి పోయిన కోడి మాం సం విక్రయాలు మరో సారి బహిర్గత మయ్యాయి. జిల్లా వైద్యశాఖ వైద్య వైద్య శాఖ అధికారి, నగర వైద్యాధికారి జాయింట్ ఆపరేషన్లో మాంసం విక్ర యాల అక్రమాలు వెలుగు చూశాయి. చెన్నై నుంచి దిగుమతి అవుతున్న కోడి లివర్ వాహనాన్ని తనిఖీలు చేసిన అధికారులు. అక్రమంగా చెన్నై నుంచి దిగుమతి చేస్తున్న 300 కేజీల కోడి లివర్ మాంసంను సీజ్ చేశారు. ఆరిఫ్ అనే వ్యాపారి కుళ్లిన కోడి మాంసం దిగుమతి చేసుకున్నట్లు అధికారు లు గుర్తించారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే ఇలాంటి మాంసం విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. నగరంలో అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి.

బీజేపీ కోటలో కోటంరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం

- కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీకి చుక్కలు చూపించిన బీజేపీ
- చంద్రమౌళి నగర్ ఒకటి నుంచి 14 వీధి వరకు బీజేపీకి తిరుగులేని ఆధిక్యత
- సావిత్రి నగర్ లోనూ కొనసాగిన బిజెపి ఆధిపత్యం
- 620 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన వైసీపీ కార్పొరేటర్ మురారి
- స్థానిక కార్పొరేటర్ బలం కన్నా కోటంరెడ్డి సోదరుల మార్క్ తో పడిన ఓట్లు
- 2014 ఎమ్మెల్యే ఎన్నికల్లో బిజెపికి 252 ఓట్ల మెజారిటీ
- ఇదీ 27వ డివిజన్ రాజకీయ పరిస్థితి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గం 27వ డివిజన్.. గత కార్పొరేషన్ ఎన్నికల్లో ఎంతో ఆసక్తి కలిగించిన డివిజన్ ఇది. బిజేపీ నుంచి వైసీపీకి నువ్వా.. నేనా అన్నట్టు పోటీ ఇచ్చారు. వైసిపి నిలబెట్టిన అభ్యర్థి బీజేపీ అభ్యర్థి కంటే బలంగా లేకపోవడంతో ఓ దశలో ఈ డివిజన్‌లో వైసిపి పని అయిపోయిందన్న ప్రచారం కూడా సాగింది. అయితే కోటంరెడ్డి సోదరులు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఈ డివిజన్ లో వైసీపీ కేవలం 620 ఓట్ల మెజారిటీతో బయటపడిందనే చెప్పవచ్చు. చంద్రమౌళి నగర్ ఒకటవ వీధి నుంచి 14వ వీధి వరకు బీజేపీ ఓటు బ్యాంకు అత్యంత బలోపేతం గా ఉంది. కార్పొరేషన్ ఎన్నికల్లో ఇది మరోసారి తేటతెల్లమైంది. ఈ 14 వీధుల్లో వైసీపీ కన్నా బీజేపీకి ఎక్కువ ఓట్లు రావడం గమనార్హం. ఇక సావిత్రి నగర్, రిత్విక్ ఎనక్లేవ్ కూడా బీజేపీ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. ఈ పరిసర ప్రాంతాల్లోని బిజెపికి 1200 ఓట్లు వచ్చాయంటే ఇక్కడ బిజెపి కున్న బలం ఏమిటో అర్థమవుతుంది. 27వ డివిజన్లో ఉన్న మిగిలిన ప్రాంతాలలో రెవెన్యూ కాలనీ పోలీస్ కాలనీ తో సహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో కోటంరెడ్డి సోదరుల హవాతో వైసీపీ తన ఓటు బ్యాంకును నిలబెట్టుకుంటూ 620 ఓట్ల మెజారిటీని సాధించింది. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పోటీ చేసినప్పుడు బిజెపి నుంచి సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పోటీ చేశారు. ఈ డివిజన్లో 252 ఓట్ల మెజారిటీతో బీజేపీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి షాక్ ఇచ్చింది. ఏ డివిజన్లో ఎంత బలం.. ఏ వీధిలో ఎంతమంది నాయకులు.. అక్కడ ఉన్న ఓట్లు అంకెల లెక్కలు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి తెలియంది కాదు. 27వ డివిజన్ లో ఎక్కడైతే వైసీపీకి బీజేపీ కంటే తక్కువ ఓట్లు వచ్చాయో ఆ ప్రాంతాల్లో నేడు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తుంటే రాజకీయ పరిశీలకులతో పాటు జర్నలిస్టులు కూడా ఆసక్తికరంగానే ఆయన పర్యటనను చూశారు. చంద్రమౌళి నగర్ లో గడపగడపకు కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి ఇళ్లకు వెళ్లి వాళ్లను పల కరించి

వారికి అందిన పథకాలను వివ రిం చారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసు కున్నారు. స్థానిక కార్పొరేటర్ మురారి కి తోడుగా 27వ డివిజన్లో సన్నపరెడ్డి సుబ్బారెడ్డి, సన్నపరెడ్డి పెంచల్ రెడ్డి,అలహరి విజయ్ కుమార్ తదితర నాయకులతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ని మరింత బలోపేతం చేశారు. అన్ని లెక్కలు వేసుకున్న తర్వాతే శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా 27వ డివిజన్ కు చెందిన అలహరి విజయ్ కుమార్ కు వ్యూహాత్మకంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే పదవిని కట్టబెట్టారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఏం చేసినా వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తారు. 27వ డివిజన్లో కేవలం కార్పొరేటర్ తోనే మొత్తం ఆధిక్యత వస్తుందంటే అది పొరపాటే.. అది సన్నపురెడ్డి పెంచల్ రెడ్డి, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, అలహరి విజయ్ కుమార్ నలుగురు సంయుక్తంగా కలిసి పనిచేస్తేనే ఇక్కడ ఆధిక్యత సాధ్యం. లేదంటే బీజేపీ, టీడీపీలు కాచుకునే ఉన్నాయి.

ఏపీ జెన్‌కోను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలి

- భూములు కోల్పోయిన నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి: జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఏపీ జెన్‌కోను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, భూములు కోల్పోయిన నిర్వాసితులకు మొదటి రెండు యూనిట్లకు సంబంధించి 350, మూడో యూనిట్ కి సంబంధించి 150 మందికి శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న అందరిని పర్మినెంట్ చేయాలని కోరుతూ కలెక్టర్ చక్రధర్‌బాబుకు శనివారం ఏపీ జెన్కో జేఏసీ, పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈనెల 27వ తేదీ ముఖ్యమంత్రి ఏపీ జెన్‌కో పర్యటన సందర్భంగా జేఏసీ ప్రతినిధి వర్గం ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించడంతో ఆ వినతి పత్రాన్ని కలెక్టర్‌కి ఇచ్చి జిల్లా కలెక్టర్‌ని కలవాలని చెప్పడంతో శనివారం కలెక్టర్‌ని కలిశారు. ఏపీ జెన్‌కో టెండర్లు పిలిచి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నందున నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడం వెంటనే చేపట్టాలని కోరారు. ఏపీ జెన్‌కో ఎండితో మాట్లాడి సత్వరం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎం. మోహన్ రావు ,ఏపీ జెన్కో జేఏసీ నాయకులు సిహెచ్ ఆదిశేషయ్య, ఎం. రవీంద్ర, కె నాగరాజు, వై. ప్రభాకర్ , ఎస్ .రవి ,సిహెచ్ .సునీల్ ఈ ప్రతినిధి వర్గంలో ఉన్నారు.

మాలకొండను దర్శించుకున్న కేంద్ర రక్షణశాఖ సహాయ సలహాదారు

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: మండలం లోని పవిత్ర పుణ్యక్షేత్రం అయిన మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామిదేవస్థానంను శనివారం కేంద్ర రక్షణశాఖ సహాయ సలహాదారు సతీష్ రెడ్డి కుటుంబ సమేతంగా మాలకొండకు చేరి స్వామిని దర్శించు కున్నారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి కె.బి.శ్రీనివాసరావు స్వాగతం పలుకగా ఆలయ ప్రధానపూజారి గౌరీశంకర్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యోగ శాలలో వేద పండితులు కార్తీక్, రామస్వామి శాస్త్రోక్తంగా నారసింహ సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొని పలు ఆహార పదార్థాలను రుచి చూసి చాలా రుచిగా ఉందన్నారు. ప్రతి శనివారం జరిగే అన్నప్రసాదం కార్యక్ర మానికి లక్ష రూపా యలు ఆలయఅధికారి కె.బి.శ్రీనివాసరావుకి విరాళం అందజేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ అధికారి కె.బి.శ్రీనివాసరావు, తహశీల్దార్ సుందరమ్మ, సిఐ.పి. సుబ్బారావు, ఆర్.ఐ.నర్సయ్య,ఎస్.ఐ.సుదర్శన్ యాదవ్, శివకుమార్ రెడ్డి, ఆలయసిబ్బంది శ్రీనువాసులు, ఇరుపని నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శివకృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన మాలేపాటి

విశాలాంధ్ర - కావలి : రూరల్ మండలం రుద్రకోట గ్రామ పంచాయతీ గుమ్మడిబొందల గ్రామా నికి చెందిన టీడీపీ కార్యకర్త బడుగు శివకృష్ణ కుటుంబాన్ని కావలి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి మాలేపాటి సుబ్బా నాయుడు శనివారం పరామర్శించారు. ఇటీవల శివకృష్ణ యాక్సిడెంట్ లో మరణించాడు. శివకృష్ణ కుటుంబానికి అవసరమైన

ఆర్థిక సహా యాన్ని అందించి, కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టీడీపీ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, మాజీ ఎంపీటీసీ తుళ్లూరు మల్లికార్జున, రుద్రకోట పంచాయతీ పార్టీ ముఖ్య నాయకులు దాసరి శ్రీనివాసులు, మండల పార్టీ ఉపాధ్యక్షులు తుళ్లూరు సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు పేరం రవిబాబు, పులుసు లక్ష్మయ్య, ఉప్పాల అచ్చయ్య, మండల పార్టీ ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి ఉప్పాల నరసింహారావు, తుళ్లూరు ఆదెయ్య పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఏపీటీఎఫ్ మద్దతు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులకు ఏపీటీఎఫ్ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ నాయకులు మాదాల వెంకటకృష్ణ. ఏపి ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ అభ్యర్థు లను గెలిపించాలని కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులకుగా మద్దతుగా పోటీ నుంచి విరమిం చుకొన్న మాదాల వెంకట కృష్ణ. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయా లన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ కోరారు. విలీనం వల్ల ప్రాథమిక పాఠశాలు నిర్వీర్యం అవుతున్నాయని, ప్రభుత్వం ప్రకటించిన 30వేల ప్రమోషన్ల జాడలేదని, పిఆర్‌సి లో ఇచ్చిన డిఏలు, నూతన డిఏలు వెంట నే ప్రకటిం చాలన్నారు. పిఎఫ్, ఏపిజిఎల్ఐ, పెండింగ్ బిల్లులు చెల్లించా లన్నారు. కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లో పని చేసే టీచర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యా వ్యవస్థ రక్షణ కోసం, ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలని పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పీ బాబు రెడ్డి కోరారు.

నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు వితరణ

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని తుఫాన్ నగర్ కు చెందిన నిరుపేద పేద మహి ళలు షేక్ షాజిద, షేక్ రుఫియా సుల్తాన ల స్వయం జీవనోపాధి నిమిత్తం శనివారం పట్టణం లోని సంయుక్త సేవా సంస్థ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో మోటార్ తో కూడిన రెండు పెద్ద కుట్టు మిషన్ లను వితరణ చేశారు. పుష్తా యోగీశ్వర రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన అల్లుడు, కలిగిరి ఎస్సై యమ్. సూర్య ప్రకాష్ రెడ్డి, వారి కుమార్తె చరిత క్రిష్ణ తేజస్వి లు దాతలుగా వ్యవహరించి ఈ మిషన్లను పేద మహిళలకు అందజేశారు. దాత ఎస్సై సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మా మామ ప్రథమ వర్ధంతి సందర్భంగా పేదలను ఆదుకోవాలని ఇద్దరు పేద మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్లు ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. మా మామ జ్ఞాపకార్థంగా భవిష్యత్తులో మరింత మంది పేదలకు సేవలందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ ద్వారా పేదలకు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, ఉపాధ్యక్షుడు గంధం ప్రసన్నాంజనేయులు, గౌరవ సభ్యుడు యమ్.అజిత్ బాబు, కుట్టు శిక్షణా ట్రైనర్ ఆయేషా, కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్ లపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర- ఉదయగిరి: స్థానిక బిట్ 1 సచివాలయంలో రిజిస్ట్రేషన్ లపై సిబ్బందికి అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ పి రమేష్ మాట్లాడుతూ ప్రజలు క్రయ విక్రయాల దస్తావేజులపై వీలునామాలపై పవర్ జనరల్ ఆఫ్ పట్టా దస్తావేజు ల ద్వారా సమిష్టి స్థిరాస్తులు కొనుగోలు అమ్మకాలు చట్టబద్ధత కల్పించుకుంటే సురక్షితంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకుంటే భద్రత తో పాటు ఆర్థిక లావాదేవీలు సైతం ఉంటుందని అన్నారు. బ్యాంకు గృహ రుణాలు ఇద్దరు వ్యక్తుల మధ్య లావాదేవీలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నారాయణ రఘు భాగ్య సుభాని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన డిప్యూటీ డిఇఓ

విశాలాంధ్ర- మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు అంబేద్కర్ నగర్ పాథమిక పాఠశాలను శనివారం డిప్యూటీ డిఈఓ బిగ్‌షా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల మెర్జింగ్ లో భాగంగా మండల కేంద్రమైన మనుబోలు అంబేద్కర్ నగర్ పాఠశాల మూడు, నాలుగు, ఐదవ తరగతి విద్యార్థులను హైస్కూలులో కలపడంపై స్థానికులు తమకు ఫిర్యాదు చేశారని, ఈ నేపథ్యంలో తాము ఈ పాఠశాలను సందర్శించేందుకు విచ్చేశామని తెలిపారు. స్థానికులు సుమారు 20 మంది పిల్లలు ఇక్కడి నుండి హైస్కూలు కు వెళ్లాలంటే శ్మశానం ఏరు ఉందని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అర్జీ రూపంలో తాము ప్రభుత్వానికి నివేదికను పంపి అనంతరం వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం వుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్థానికులు పాల్గొన్నారు.

తాలుకా ఏపీఎన్జీవో సంఘం కార్యవర్గ ఎన్నిక

అధ్యక్షులుగా మల్లికార్జున

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు తాలూకా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక కోసం రాపూరు మండల పరిషత్ కార్యా లయంలోని సమావేశ హాలులో జరిగిన కార్య క్రమంలో ఎన్నికల అధికారిగా బండారుపల్లి వెంకటేశ్వర్లు, సహాయ ఎన్నికల అధికారి గాదిరాజు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగుండ్ల మధు ఆధ్వర్యంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాపూరు తాలూకా అధ్యక్షులుగా తోట మల్లికార్జున రావు, కార్యదర్శిగా పిల్లకదుపు చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షులుగా కొడవలూరు విజయ్ శేఖర్, కోశాధికారిగా ఎం భాస్కర్ లక్ష్మి, ఉపాధ్యక్షు లుగా రాజేంద్రప్రసాద్, బాలకృ ష్ణ, కాంతమ్మ సంయు క్త కార్యదర్శులుగా ఎం లక్ష్మణ, టి చంద్రమోహన్, పి శివప్రసాద్, మహిళా సం యుక్త కార్యదర్శిగా కే ఉదయని, మునస్వామిని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర- తోటపల్లి గూడూరు: నిరుపేద బాల బాలికలకు, గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నదే అంగన్వాడీ కేంద్రాల వ్యవస్థ ముఖ్య ఉద్దేశ్యమని ఇందుకూరుపేట ప్రాజెక్ట్ సీడీపీఓ హేన సుజన్ పేర్కొన్నారు. శనివారం తోటపల్లిగూడూరు మండలం కోడూరులో మంజూరైన సాటిలైట్ అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణానికి స్థానిక వైసీపీ నాయకులు కావల్ రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హేన సుజన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, మూడేళ్ల పైబడిన ప్రీస్కూల్ పిల్లల కు సెంటర్‌లోనే బియ్యం, పప్పు కూరగాయలతో వండిన పోషకాహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటితో పాటు పాలు, ఒక గుడ్డు చొప్పున ఇవ్వనున్నామని హేన సుజన్ తెలిపారు. అంతే కాకుండా పౌష్టికాహారానికి అనుబంధంగా మధ్యాహ్న భోజనంలో తాజా ఆకు కూరలు, కూరగాయలతో కూడిన పోషకాహారం ఇచ్చే కార్యక్రమానికి స్త్రీ, శిశు సంక్షేమశాఖ శ్రీకారం చుట్టిందని సీడీపీఓ చెప్పారు. అలాగే స్థానికంగా లభ్యమయ్యే కూర గాయలతో పాటు ఆకు కూరలను పెంచాలని టీచర్లు, ఆయాలకు సూచనలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అంతేకాకుండా గర్భిణు లు, బాలింతలు తమ ఇంటి పెరట్లోనూ న్యూట్రీషన్ గార్డెన్ల పెంపకం చేపట్టేలా ప్రోత్సహిస్తున్నట్లు హేన సుజన్ తెలిపారు.

12 శాటిలైట్ భవనాలు

మండలానికి 12 శాటిలైట్ భవనాలు మంజూరు అయ్యాయని సీడీపీఓ హేన సుజన్ తెలిపారు. ఈ మేరకు కోడూరు సెక్టర్ పరిధిలో 5 శాటిలైట్ బిల్డింగ్స్ మంజూరు అయ్యయన్నారు. కొత్తకోడూరు 1, నెలిమిట్టకండ్రిగ గ్రామంలో 2 అంగన్వాడీ కేంద్ర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేయడం జరిగిందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కోడూరు సెక్టర్ సూపర్వైజర్ ఏ. సుబ్బమ్మ, అంగన్వాడీ టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి పేరు పెట్టడం హర్షనీయం

విశాలాంధ్ర- కోవూరు: నెల్లూరు బ్యారేజ్ కి, దివంగత నేత, మాజీ మంత్రి, నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేరును ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇటీవల నెల్లూరు పర్యటన లో ప్రకటించడం పట్ల కోవూరు నియోజకవర్గం ప్రజలు అధిక సంఖ్యలో హర్షం వ్యక్తం చేసారు. శ్రీనివాసులు రెడ్డి ని ఆదర్శంగా తీసుకొని తనయుడు, ప్రసన్న కుమార్ రెడ్డి సమాజ సేవలలో దూసుకు పోతున్నారు. ఒక పక్క ఎమ్మెల్యే గా ఉంటూ అందరి సమస్య లను పరిష్కరిస్తూ, అభివృద్ధి పథంలో అడుగులు వేస్తూ ప్రతి నిత్యం ప్రజలు మధ్యలోనే ఉంటూ అండగా నిలుస్తూ ఎస్ఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం బాధితులకు అందిస్తున్న ఘనత, నల్లపరెడ్డి కుటుంబం కే సాధ్యం అయిందని పలువురు చర్చించు కొంటున్నారు. చిన్న వయసు లోనే ప్రసన్న టీడీపీ, ఎన్టీఆర్ ప్రభుత్వం లోనే చక్కెర శాఖ మంత్రిగా పని చేసి, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత కూడ ఉంది. తండ్రి బాటలోనే అడుగులు వేస్తూ ప్రజలు మన్ననలు పొందిన ఎమ్మెల్యేగా శభాష్ అని పించు కొంటున్న నేపథ్యంలో రాష్ట్ర సీఎం జగన్, ఒక్కసారిగా శ్రీనివాసులు రెడ్డి పేరును నెల్లూరు బ్యారేజ్ కి పెట్టడంపట్ల సీఎం గుర్తించి తమతండ్రి కి ప్రాధాన్యత ఇచ్చి, గొప్ప పని చేయడం పట్ల తమ కుటుంబం జగన్ వెంటే జీవితాంతం ఉంటామని ఎమ్మెల్యే ప్రసన్న సీఎం జగన్‌కు అభినందనలు తెలుపుతున్నానన్నారు.

జి తెలుగులో అక్టోబర్ 31 నుండి తండ్రి ప్రేమ కోసం కూతురు పడే తపనే 'అమ్మాయిగారు'

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: అద్భుతమైన కథ - కథనాలు , ప్రేక్షకుల్ని కట్టిపడేసే మలుపులతో గత కొన్నేళ్లుగా ప్రేక్షక లోకాన్ని ఎంటర్ టైన్ చేస్తోంది మన జీ తెలుగు. ఎప్పటిలాగే ఇప్పుడు కూడా ఒక విభిన్న కథాంశంతో 'అమ్మాయిగారు' అనే సరికొత్త ధారావాహికతో మన ముందుకు రాబోతుంది. అక్టోబర్ 31 న ప్రారంభం కానున్న ఈ సీరియల్ సోమవారం నుంచి శనివారం వరకు రాత్రి 9.30 లకు ప్రసారం కానుంది. ' అమ్మాయిగారు ' - తండ్రి ప్రేమ కోసం తపన పడే కూతురు , కూతురిని దూరంగా పెట్టే తండ్రి , ఈ ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ప్రతి ఒక్కరికి నచ్చుతాయి. నేటి తరం తండ్రి కూతురు అనగానే అందరికి గుర్తుకువచ్చేది సూపర్ స్టార్ మహేష్ , సితార . అందుకే ఇప్పుడు ఈ అమ్మాయిగారు సీరియల్ని సూపర్ స్టార్ మహేష్ , ఆయన గారాలపట్టి సితార లాంచ్ చేశారు . లాంచ్ డైలాగ్ 'ప్రేమలేని ఐశ్వర్యం ... ఐశ్వర్యమే కాదు ... అమ్మాయిగారు సీరియల్స్ ప్రోమోలో మహేష్ చెప్పిన అంచనాలు పెంచేసింది . ఈ సీరియల్ ఎప్పుడెప్పుడు ప్రసారం అవుతుందా? అని ఆడియన్స్ వెయిట్ చేస్తున్నారు. ఇక అమ్మాయిగారు కథ విషయానికి వస్తే ... రూప , ప్రతాప్ సూర్యదేవ్, రాజు అనే మూడు పాత్రల చుట్టూ తిరుగుతుంది. విద్యాశాఖ మంత్రి అయిన ప్రతాప్ సూర్యదేవ్ కూతురే రూప. పుట్టింది, పెరిగింది డబ్బున్న కుటుంబంలో అయినా తండ్రి ఆలనాపాలనకు , ప్రేమానురాగాలకు దూరం అవుతుంది రూప. అయితే గతంలో జరిగిన ఒక సంఘటనతో తన భార్యపై ఉన్న కోపాన్ని రూపపై చూపిస్తుంటాడు ప్రతాప్ సూర్యదేవ్ . కానీ రూప మాత్రం ఎప్పటికైనా తండ్రి తన మమకారాన్ని అర్థం చేసుకుంటాడని ఎదురుచూస్తుంటుంది. మరోవైపు ప్రతాప్ సూర్యదేవ్ కి కుడి భుజంగా ఉంటాడు . ' రాజు సూర్యదే వ్యవహారాలు మొత్తం దగ్గరుం డి చూసుకునేది రాజునే . అలాంటి రాజు , రూప మధ్య ఆసక్తికరమైన సంబంధం ఏర్పడుతుంది . అదే సమయంలో ఒక కీలకమైన మలుపుతో మొత్తం వ్యవహారం మారిపోతుంది . ఇలాంటి సమయంలో రాజు పాత్ర ఎలాంటి మలుపులకు దారి తీస్తుంది . ? రూప తన తండ్రి ప్రేమను తిరిగి పొందుతుందా . ? అనేది తెలియాలంటే అక్టోబర్ 31 నుంచి జీ తెలుగులో ప్రసారం అయ్యే అమ్మాయిగారు సీరియల్ చూడాల్సిందే . ఈ సందర్భంగా సీరియల్లో కీలకపాత్రలో నటించిన నిషా రవికృష్ణన్ మాట్లాడారు . " జీ తెలుగులో ఇది నా రెండో షో . అమ్మాయిగారు సీరియల్ ఎప్పుడెప్పుడు ప్రసారం అవుతుందా అని నేను చాలా ఎగ్జైటెడ్ గా ఉన్నాను . ఆసక్తికరమైన విషయం ఏమిటంటే , నా మొదటి సీరియల్ ముత్యమంత ముద్దుని హీరోయిన్ కృతి శెట్టి ప్రారంభించారు . ఇప్పుడు నా రెండో సీరియల్ని సూపర్ స్టార్ మహేష్ , ఆయన ముద్దుల కూతురు సితార ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది . ఒక టీమ్ , మేమంతా లాంచ్ గురించి చాలా ఎగ్జైటెడ్ గా ఉన్నాము . ఎందుకంటే అమ్మాయిగారు కథ చాలా ప్రత్యేకమైంది. ప్రధానంగా ఇది తండ్రికూతుళ్ల మధ్య బంధం , అనుబంధాలను ఆవిష్కరి స్తుంది . ఈ సీరియల్కు కూడా ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారని ఆశిస్తున్నానన్నారు . కూతురు రూప , తండ్రి ప్రతాప్ సూర్యదేవ్ మధ్య ప్రేమానురాగాలే ప్రధాన కథాంశంగా రూపొందిన అమ్మాయిగారు సీరియల్ మీ అభిమాన జీ తెలుగు ఛానల్ లో అక్టోబర్ 31 నుండి సోమవారం నుంచి శనివారం వరకు రాత్రి 9.30 లకు ప్రసారం కానుంది .

నాయీ బ్రాహ్మణులకు టిటిడి ఈవో క్షమాపణ తెలపాలి

- నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలగురుస్వామి

విశాలాంధ్ర - కావలి : తిరుమలలో క్షురకుల పట్ల విజిలెన్స్ అధికారులు ప్రవర్తించిన తీరు అసభ్యకరమని, అమానుషమని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పుటూరి బాలగురుస్వామి అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల కొండ మీద డ్యూటీ లో ఉన్న కేశఖండన వారి పట్ల విజిలెన్స్ అధికారులు అసభ్యకరంగా ప్రవర్తిస్తే, దానికి క్షురకులు ధర్నా చేస్తే టిటిడి ఈవో ధర్మారెడ్డి వారిని బెదిరిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని తెలిపారు. తిరుమల కొండ మీద అస్సలు అవినీతి జరగడం లేదని ఈవో ధర్మారెడ్డి ఏడుకొండల స్వామి మీద ప్రమాణం చెయ్యగలరా? అని ప్రశ్నించారు. విజిలెన్స్ సిబ్బంది వారి విధులు నిర్వర్తించాలి, అందుకని ఒంటి మీద బట్టలు విప్పి డ్రాయర్ మీద నించో పెడతారా? ఆడవాళ్ళని మగ వాళ్ళు తనికీ చేస్తారా? లాకర్స్ పగలకొట్టి, సెల్ ఫోన్స్ లాగేసుకొని, కుల వృత్తిని, వైకల్యాన్ని దూషించడం చేయవచ్చా? ఈ అధికారాలను విజిలెన్స్ వారికి ఎవరు ఇచ్చారు? అని ప్రశ్నించారు. గతంలో 2017 లో భక్తులు దగ్గర బలవంతంగా డబ్బులు తీసుకుంటున్నారు అని 247 మందిని తొలగించారని, అప్పుడు సుమారుగా 40 రోజులు ఉద్యమం జరిగిందని, అప్పటి ఈవో అశోక్ కుమార్ సింఘాల్ తో జరిపిన చర్చలలో సీసీ టీవీ

ఫుటేజ్ ని, అధికారులతో కలిసి స్వయంగా నేను కూడా దగ్గర ఉండి చూశానన్నారు. ఎక్కడా కూడా భక్తులు దగ్గర బలవంతంగా డబ్బులు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. చాలి చాలని జీతాలతో బ్రతుకుతున్న క్షురకులు తమ ఉద్యోగం పర్మినెంట్ అవుతుందని, జీవితం బాగుంటుం దనే ఆశతో ఉద్యోగం చేస్తున్నారు తప్ప, వేరే ఆలోచన లేదన్నారు. క్షురకుల పై చర్యలు తీసుకోవడం వంటివి చేస్తే, ప్రపంచం మొత్తం తిరుమల వైపు చూసేలా ఉద్యమం ఉంటుందని హెచ్చరించారు. టీటీడీ క్షురకులని తక్షణమే పెర్మనెంట్ చెయ్యాలని డిమాండ్ చేశారు.